ఎందుకింత నిర్లక్ష్యం..!

- పొట్టి శ్రీరాములు కల్యాణ మండపం నిర్వహణ గాలికి..
- శిథిలమైనా పట్టించుకోని జీవీఎంసీ అధికారులు
- మందుబాబులకు అడ్డాగా మండపం
- వినియోగంలోకి తేవాలని కోరుతున్న స్థానికులు



39వ వార్డులో శిథిలావస్థకు చేరిన పొట్టి శ్రీరాములు కల్యాణ మండపం



ఆకతాయిలు విరగ్గొట్టిన మండపం తలుపులు



పూర్తిగా శిథిలమైన వంటగది, తాగునీటి పైపులు

జగదాంబ: జీవీఎంసీకి ఆదాయం వచ్చే ఆస్తులను గాలికి వదిలేసింది. పైగా వాటినే చూపిస్తూ వేలం పాటలు నిర్వహించడం గమనార్హమంటూ పలువురు ప్రజలు ఎద్దేవా చేస్తున్నారు. 39, 35 వార్డుల్లో జీవీఎంసీకి సంబంధించి పొట్టి శ్రీరాములు కల్యాణ మండపం, పాత బస్టాండ్ వద్ద 16 దుకాణాలతో కూడిన షాపింగ్ కాంప్లెక్స్ ఉంది. వీటిని ఏళ్లుగా జీవీఎంసీ విస్మరించి వదిలేయడంతో అవి దాదాపుగా శిథిలావస్థకు చేరుకున్నాయి. వాటిని పట్టించుకునే నాథుడే లేకపోవడంతో మందుబాబులకు నిలయంగా మారాయి. దీంతో జీవీఎంసీకి ఆర్థికంగా నష్టం రావడమే కాకుండా.. మందుబాబుల వల్ల అక్కడి వీధుల్లో నివసిస్తున్న మహిళలు, స్థానికులు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడింది.

శిథిలమైన పొట్టి శ్రీరాములు కల్యాణ మండపం

విశాఖపట్నం పుట్టిన ప్రాంతం వన్ టౌన్ అంటేనే ఇరుకు రోడ్లు.. సందులు.. ఎక్కడ ఏ శుభకార్యం జరుపుకోవాలన్నా వీధిలోని రోడ్లు బ్లాక్ చేయాల్సిన పరిస్థితి. ఈ సమస్యకు పరిష్కారం చూపే ఉద్దేశంతో 1983లో విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ పాత నగరం 39వ వార్డులో ప్రజల సౌకర్యార్థం కార్యక్రమాల నిర్వహణకు పొట్టి శ్రీరాములు కల్యాణ మండపం నిర్మించింది. అప్పటి నుంచి దానికి ఏనాడు కనీసం మరమ్మతులు చేపట్టకపోవడంతో నేడు ఆ మండపం శిథిలమై.. మందుబాబులకు అడ్డాగా మారింది. పాత వాహనాలు పెట్టుకునేందుకు పార్కింగ్ ఏరియాగా తయారైంది. పగలూ, రాత్రి లేకుండా మందుబాబులు, ఆకతాయిలు మండపం వద్ద చేరి చిందులు వేస్తున్నారు. మండపం తలుపులు విరగ్గొట్టి పరిసరాలను నాశనం చేస్తున్నారు. మద్యం తాగి బాటిళ్లను మండపం ఆవరణలో పడేస్తున్నారు. దీంతో అటుగా వెళ్లేందుకు స్థానిక మహిళలు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.



కల్యాణ మండపం వద్ద మందుబాబులు తాగి పడేసిన బీరు సీసాలు

ప్రతి ఏటా వేలంపాట

ఒకవైపు జీవీఎంసీ ఆస్తులు శిథిలమై మూలకు చేరి ఉంటే.. మరోవైపు జీవీఎంసీ జోన్-4లో మాత్రం ప్రతి ఏటా వాటికి వేలంపాట నిర్వహిస్తున్నారు. మార్చిలో వేలంలో వెళ్లకపోతే నెలనెలా కూడా వేలం పెడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యమా.. లేదా పర్యవేక్షణ లోపమో తెలియదు కానీ మూలకు చేరిన ఆస్తులపై ఏటా వేలం నిర్వహించడమేంటని పలువురు విమర్శిస్తున్నారు. అందుబాటులో ఉన్న పొట్టి శ్రీరాములు కల్యాణ మండపం శిథిలం కావడంతో శుభకార్యాలు, ఇతర కార్యక్రమాల నిర్వహణకు ఇబ్బంది పడుతున్నామని 39వ వార్డు ప్రజలు వాపోతున్నారు. జీవీఎంసీ ఉన్నతాధికారులు దృష్టి సారించి ప్రజల సౌకర్యార్థం తగు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

శుభకార్యాలకు ఇబ్బందులు

మేమంతా పేదవాళ్లం. బయట డబ్బులు ఇచ్చి కల్యాణ మండపాలు బుక్‌చేసుకోలేని పరిస్థితి. ఏమైనా కార్యక్రమాలు జరిగితే వీధి రోడ్లను మూసేయాల్సి వస్తోంది. దీంతో అందరం ఇబ్బందులు పడుతున్నాం. జీవీఎంసీ అధికారులు స్పందించి పొట్టి శ్రీరాములు కల్యాణ మండపానికి మరమ్మతులు చేసి అందుబాటులోకి తీసుకురావాలి.

– యాసీన్ బాబ్జి, షాదిఖానా ప్రాంతం, వన్ టౌన్

మందుబాబుల ఆగడాలు

శిథిలావస్థకు చేరిన పొట్టి శ్రీరాములు కల్యాణ మండపాన్ని మందుబాబులు అడ్డాగా మార్చుకున్నారు. పగలూ, రాత్రి తేడా లేకుండా అక్కడ తిష్ట వేస్తున్నారు. ఆ రోడ్డులో స్కూల్‌కు, పనులకు వెళ్లే వారందరూ ఇబ్బందులు పడుతున్నారు. శుభకార్యాలు జరిగే చోట తగాదాలు జరుగుతున్నాయి. అధికారులు వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలి.

–రహ్మతుల్లా బేగ్, కోట వీధి

మరమ్మతులు చేయాలి

పాతనగరంలోని ఒకే ఒక్క కల్యాణ మండపం నిర్వహణను ఎవరూ పట్టించుకోవడం లేదు. అధికారులు ప్రతి ఏటా వేలంపాటలు నిర్వహిస్తున్నారు. మరమ్మతులు చేసి వేలంపాట నిర్వహిస్తే ప్రజలు అందుబాటులో ఉంటుంది.

– రాజు, థామ్సన్ వీధి

ప్రహరీ నిర్మించాలి

పొట్టి శ్రీరాములు కల్యాణ మండపానికి చుట్టూ ప్రహరీ నిర్మిస్తే ఆకతాయిలు లోపలికి రాకుండా ఉంటారు. జీవీఎంసీ అధికారులు స్పందించి సెక్యూరిటీని ఏర్పాటు చేయాలి.

– సుబ్రహ్మణ్యం, కోట వీధి

క్లుప్తంగా

అధినేత జగన్‌ను కలిసిన తైనాల



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో గురువారం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తైనాల విజయకుమార్ మర్యాదపూర్వకంగా కలిశారు. భీమిలి, గాజువాక నియోజకవర్గాల పరిశీలకుడిగా తనను నియమించిన సందర్భంగా అధినేతకు ధన్యవాదాలు తెలియజేశారు. - మహారాణిపేట

బాధితులకు అండగా ఉంటాం



మృతుడు నాగరాజు భార్యకు ఆర్థిక సాయం అందిస్తున్న కార్పొరేటర్ పూర్ణిమ

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం సెబాస్టియన్ కాలనీలో నివసిస్తున్న బొద్దాన నాగరాజు అనారోగ్యంతో మరణించాడు. ఆ కుటుంబానికి ఆసరాగా నిలవాలనే ఉద్దేశంతో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నేతృత్వంలో గురువారం సాయంత్రం నాగరాజు భార్య బొద్దాన దేవి కుటుంబాన్ని పరామర్శించారు. ఆమెకు కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ చేతుల మీదుగా రూ.5 వేలు నగదు అందజేశారు. ఈ సందర్భంగా పూర్ణిమ మాట్లాడుతూ మృతుడు నాగరాజు కిడ్నీ సమస్యతో బాధపడుతున్నప్పుడు వైద్య ఖర్చులకు ఆర్థికంగా ఆదుకున్నామన్నారు. బాధిత కుటుంబానికి ఏ సమస్య వచ్చినా వైఎస్సార్‌సీపీ తరఫున అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో బొండాల రామారావు, అర్నాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కుమ్మర వీధిలో అన్నదానం



అన్నప్రసాదం వడ్డిస్తున్న పచ్చిరిపల్లి రాము

అల్లిపురం: కుమ్మర వీధిలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమాన్ని వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు పచ్చిరిపల్లి రాము ప్రారంభించారు. కుమ్మర వీధి, అమ్మవారి వీధి, బంగారుమెట్ట ప్రాంతాలకు చెందిన భక్తులు పాల్గొని గణపతి అన్నప్రసాదం స్వీకరించారు.

కనకమహాలక్ష్మికి పంచామృతాభిషేకం

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువా రం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవ లో పలువురు ఉభయ దాతలు పాల్గొనగా.. ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శోభారాణి, ఏఈవో కె.రాజేంద్రకుమార్, ఆలయ సిబ్బంది పర్యవేక్షించారు. రూ.1,000 పూజా రుసుం చెల్లించి భక్తులు ఈ పూజలో పాల్గొనవచ్చు. పరోక్ష పద్ధతిలో ఈ పూజ చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబర్ 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081లో రుసుం చెల్లించవచ్చు.

రోడ్డు ప్రమాద బాధితులకు పరిహారం అందజేత

విశాఖ సిటీ : రోడ్డు ప్రమాదంలో మృతుని కుటుంబ సభ్యులకు, క్షతగాత్రులకు నగర పోలీస్ కమిషనరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రమాద బాధితుల సహాయక కేంద్రం ద్వారా రూ.3 లక్షలు పరిహారం అందజేశారు. హిట్ అండ్ రన్‌లో అనకాపల్లి జిల్లా పిసినికాడ గ్రామానికి చెందిన ఎడ్ల హేమంత్‌కుమార్ ఇటీవల మృతి చెందాడు. దీంతో అతని భార్య వరలక్ష్మికి రూ.2 లక్షలు అందజేశారు. అలాగే హిట్ అండ్ రన్‌లో కేసులో క్షతగాత్రులైన అనుపోజుల దుర్గారావు, నేబర్తి కనకారావులు ఒక్కొక్కరికీ రూ.50 వేలు చొప్పున ఇచ్చారు. హిట్ అండ్ రన్ కేసుల్లో ఎవరైనా సహాయం కోసం రోడ్డు ప్రమాద బాధితుల సహాయక కేంద్రంలో గానీ టోల్‌ఫ్రీ నెంబర్ 7995095793 టోల్‌ఫ్రీ నెంబర్‌కు గానీ సంప్రదించాలని పోలీసులు సూచించారు.

ఇంటింటికీ కూటమి మోసాలు



33వ వార్డులో నివాసులకు చంద్రబాబు మోసాలను వివరిస్తున్న రమేష్, పార్టీ శ్రేణులు



35వ వార్డులో కూటమి మోసాలపై ప్రచారం చేస్తున్న అలుపన కనకరెడ్డి, పార్టీ శ్రేణులు

అల్లిపురం: మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ దక్షిణ సమన్వయకర్త వాసుపల్లి గణేష్‌కుమార్ ఆదేశాల మేరకు పార్టీ 33వ వార్డు అధ్యక్షుడు ముత్తాబత్తుల రమేష్ ఆధ్వర్యంలో గురువారం వార్డులో బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బూత్ నంబర్ 74లోని మూడు గుళ్ల ప్రాంతంలో గడప గడపకు వెళ్లి ముఖ్యమంత్రి చంద్రబాబు ఇచ్చిన మోసపూరిత హామీలను, కూటమి ప్రభుత్వ మోసపూరిత పాలనను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో వార్డు సీనియర్ నాయకులు పచ్చిరిపల్లి రాము, హేమాలక్ష్మి, బూరుల చిన్న, శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ ఆడారి వెంకట మహేష్, పి.వి.శిరీష, ఏవీఎస్ రెడ్డి, కృష్ణారెడ్డి, బాల నారాయణరెడ్డి, సౌత్ కల్చరల్ వింగ్ అధ్యక్షుడు సూర్య నాయుడు, కనిగిరి సంతోష్‌కుమార్, బాడుగుల శ్రీనివాసరావు, చికెన్ రాము, ధర్మారావు, సత్య, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

35వ వార్డులో విస్తృత ప్రచారం

జగదాంబ: జీవీఎంసీ 35వ వార్డులో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు అలుపన కనకరెడ్డి ఆధ్వర్యంలో గురువారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. బూత్ నంబర్ 95 మేదర వీధి ఏరియాలో ఇంటింటికీ వెళ్లి నివాసులకు చంద్రబాబు మోసాల గురించి, సక్రమంగా అమలు కాని పథకాల గురించి కనకరెడ్డి వివరించారు. కూటమి ప్రభుత్వ పాలనలో మోసాలపై ముద్రించిన కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ సిటీ సెక్రెటరీ అబ్బిరెడ్డి, ఆది విష్ణురెడ్డి, నాగిరెడ్డి, రవికుమార్, పోలవరపు రమణమ్మ, నగేష్, శేఖర్, నాగార్జున, దుర్గాప్రసాద్, లోకేష్ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగా మాస్టార్ కళాధర్‌కు సత్కారం



యోగా మాస్టార్ కళాధర్‌ను సత్కరిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చీ తదితరులు

అల్లిపురం: ఆసియా పసిఫిక్ 3.0 యోగా స్పోర్ట్స్ చాంపియన్‌షిప్-2025లో విశాఖకు చెందిన డాక్టర్ వి.కె.వి.కె.కళాధర్ రెండు బంగారు పతకాలు సాధించారు. ఈ సందర్భంగా ఆయనను నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి సత్కరించారు. అల్లిపురం నీలమ్మ వేపచెట్టు గుడి సమీపంలో శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణపతి మండపం వద్ద గురువారం యూత్ అసోసియేషన్, మందడుగు మల్లేష్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో సీపీ పాల్గొని కళాధర్‌ను అభినందించారు. కార్యక్రమంలో సినీ నటుడు ఐ.ప్రసన్నకుమార్, 33వ వార్డు కార్పొరేటర్ భీశెట్టి వసంతలక్ష్మి, గోపికృష్ణ(జీకే), బ్రహ్మకుమారి రామేశ్వరి, లక్ష్మణ్ డిజిటల్స్ సైన్స్ అధినేత మొల్లేటి లక్ష్మణరావు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్తకు భరోసా



పుష్పకు నగదు, రేషన్ సరకులు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్

కంచరపాలెం: జీవీఎంసీ 41వ వార్డు జ్ఞానాపురం బాబూ కాలనీలో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ మహిళా కార్యకర్త కండి పుష్ప కొద్ది నెలలుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు. వార్డు పర్యటనలో గురువారం కార్పొరేటర్ కోడిగుడ్ల పూర్ణిమ పుష్ప నివాసానికి వెళ్లి ఆమెను పరామర్శించారు. ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పార్టీ తరఫున అన్ని విధాల ఆదుకుంటామని భరోసా ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు కోడిగుడ్ల శ్రీధర్ నెల రోజులకు సరిపడా బియ్యం, నిత్యావసర సరకులు, వైద్య ఖర్చులకు రూ.5 వేలు నగదును పుష్పకు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు, వేళంగిణిరావు, పాత్రపల్లి సునీల్‌కుమార్, రాజు, మధు, ఈశ్వరి, దేవి, అన్నపూర్ణ, కార్యకర్తలు పాల్గొన్నారు.

13 నుంచి గర్భాశయ క్యాన్సర్ నివారణ వ్యాక్సినేషన్

మహారాణిపేట: ఆడపిల్లలకు గర్భకోశ ముఖద్వార క్యాన్సర్ రాకుండా ఉండేందుకు ఈ నెల 13 నుంచి 16 వరకు సీతమ్మధారలోని లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రిలో ఉచిత వ్యాక్సినేషన్ శిబిరం నిర్వహిస్తున్నట్లు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు, లయన్స్ క్లబ్ ఆఫ్ వైజాగ్ చారిటబుల్ ట్రస్ట్ చైర్‌పర్సన్ డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో 9 నుంచి 14 ఏళ్ల వయసు లోపు బాలికలకు ఉదయం 10.30 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు క్యాన్సర్ నివారణ వ్యాక్సిన్ ఉచితంగా వేస్తామని పేర్కొన్నారు. ఇప్పటికే 600 మంది ఆడపిల్లలు తమ పేర్లు రిజిస్టర్ చేసుకున్నారని, వారంతా నాలుగు రోజుల పాటు నిర్వహిస్తున్న శిబిరాన్ని సందర్శించి టీకా వేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి లయన్స్ క్యాన్సర్ ఆస్పత్రి మేనేజింగ్ ట్రస్టీ ఆచార్య వెలగపూడి ఉమామహేశ్వరరావు హాజరవుతారన్నారు. ఇదివరకు మొదటి డోస్ వేసుకొని ఆరు నెలల సమయం గడిచిన వారికి రెండో డోస్ వేసుకునే అవకాశం కల్పిస్తున్నామని డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు.

హేరంభ గణపతికి గరిక పూజ



గరిక పూజలో హేరంబ గణపతి



సీపీ శంఖబ్రత బాగ్చిని శేషవస్త్రంతో సత్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

అల్లిపురం: నీలమ్మ వేపచెట్టు అమ్మవారి దేవస్థానం రోడ్డులో శ్రీ గణపతి నీలమాంబ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గణపతి ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం స్వామి వారికి గరిక పూజ చేశారు. కమిటీ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం గణపతికి విశేష హారతులు, నక్షత్ర హారతులు సమర్పించారు.

గణపతిని దర్శించుకున్న సీపీ బాగ్చి

నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి గురువారం హేరంభ గణపతిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు కమిటీ సభ్యులు భీశెట్టి గోపికృష్ణ, ఆకుల రాజు తదితరులు స్వాగతం పలికారు. గణపతికి సీపీ పూజలు చేశారు. అనంతరం ఆయనను స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

నగరంలో పారిశుద్ధ్యం మెరుగుకు కృషి

- ఉదయం 6 నుంచే అధికారులు, సిబ్బంది విధుల్లో ఉండాలి
- జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్
- జోన్-3, 4ల్లో క్షేత్ర పర్యటన



రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డును ఆక్రమించిన కూరగాయల దుకాణాన్ని తొలగించాలని జెడ్సీని ఆదేశిస్తున్న జీవీఎంసీ కమిషనర్



జగదాంబ జంక్షన్ వద్ద సిబ్బంది హాజరును ఫోన్‌లో పరిశీలిస్తున్న కమిషనర్ కేతన్‌గార్గ్

డాబాగార్డెన్స్: ప్రజారోగ్యం దృష్ట్యా నగర పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలని అధికారులకు జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ సూచించారు. క్షేత్ర పర్యటనలో భాగంగా గురువారం జోన్-3, 4 కార్యాలయ పరిధిలోని 19, 20, 30 వార్డుల్లో ఆయన పర్యటించారు. ముందుగా జోన్-4 పరిధి 30వ వార్డు జగదాంబ జంక్షన్, లేపాక్షి జంక్షన్, పూర్ణా మార్కెట్ తదితర ప్రాంతాల్లో పర్యటించి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులు, పారిశుధ్య కార్మికుల హాజరును ఫోన్‌లో పరిశీలించారు. వ్యర్థాలు చాలా చోట్ల కనిపిస్తున్నాయని, విధుల్లో అలసత్వం వహించరాదని వారికి సూచించారు. ప్రజారోగ్య అధికారులు, సిబ్బంది ఉదయం 6 గంటల నుంచే విధుల్లో ఉండేలా చర్యలు చేపట్టాలని అన్ని జోన్ల కమిషనర్లను వాకీటాకీ ద్వారా ఆదేశించారు. పలువురు పారిశుధ్య కార్మికులను వారి విధులు, హాజరును అడిగి తెలుసుకున్నారు.

వ్యాపారులకు వెండింగ్ జోన్‌లో అవకాశం

అనంతరం జోన్-3 పరిధి ఉషోదయ జంక్షన్ నుంచి రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వరకు కమిషనర్ పర్యటించారు. డ్రోన్ ద్వారా ఆయన పరిశీలించగా వ్యర్థాలు ఎక్కడపడితే అక్కడ అధికంగా కనిపిస్తున్నాయని శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, కార్యదర్శులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రామలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద రోడ్డును ఆక్రమించి కూరగాయలు విక్రయిస్తున్న వ్యాపారి దుకాణం తొలగించి, ప్రతి జోన్‌లో ఏర్పాటు చేస్తున్న వెండింగ్ జోన్‌లో వారికి ఒక దుకాణం కేటాయించాలే చూడాలని జోనల్ కమిషనర్ శివప్రసాద్‌ను ఆదేశించారు. ఉషోదయ జంక్షన్‌లోని ఫ్రీ లెఫ్ట్‌లో ఆక్రమణలో ఉన్న బడ్డీలను వెంటనే తొలగించి, ఆ చిరు వ్యాపారులకు వెండింగ్ జోన్‌లో అవకాశం కల్పించాలని, కూడలిలో వాహనాల రాకపోకలకు ఫ్రీ లెఫ్ట్‌లో 50 మీటర్ల వరకు ఆక్రమణలు లేకుండా చూడాలని ఆదేశించారు. అక్కడ నూతనంగా నిర్మిస్తున్న భవనాల యజమానులు నిర్మాణ సామగ్రిని రోడ్డుపై వేయకుండా చర్యలు తీసుకోవాలని సిటీ ప్లానర్‌ను ఆదేశించాలని జెడ్సీకి సూచించారు. నిత్యం అధికారులు వార్డుల్లో పర్యటిస్తూ పారిశుద్ధ్యం మెరుగుకు కృషి చేయాలన్నారు. పర్యటనలో ఏఎంహెచ్‌వో డాక్టర్ ఒ.బి.ప్రసాదరావు, శానిటరీ సూపర్‌వైజర్ సత్యనారాయణ, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, శానిటరీ కార్యదర్శులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలన పథకాలతో ప్రయోజనాలు



మాట్లాడుతున్న జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు

విశాఖలీగల్: పేదరిక నిర్మూలన పథకాల వల్ల ఎన్నో ప్రయోజనాల ఉన్నాయని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ(డీఎల్ఎస్ఏ) కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. గురువారం జిల్లా కోర్టు ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. పట్టణ పేదలకు పథకాలు అందించడంలో మెప్మా, డీఆర్‌డీఏ పాత్ర ఎంతో ఉందన్నారు. కార్యక్రమంలో ఎస్సీ కార్పొరేషన్ ఏడీ సత్య పద్మ, డీఆర్‌డీఏ, జిల్లా పరిషత్ అధికారులు, కె.శంకరరావు పాల్గొన్నారు.

బాలబాలికలతో కలిసి ప్రో కబడ్డీ వీక్షించిన సీపీ



ప్రో కబడ్డీ మ్యాచ్ వీక్షిస్తున్న స్వచ్ఛంద సంస్థల బాలబాలికలతో సీపీ బాగ్చి

అల్లిపురం: పోర్టు ఇండోర్ స్టేడియంలో గురువారం జరిగిన ప్రో కబడ్డీ మ్యాచ్‌ను 24 మంది స్వచ్ఛంద సంస్థల బాలబాలికలతో కలిసి నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి వీక్షించారు. స్వచ్ఛంద సంస్థల్లో ఉంటున్న బాలబాలికలకు ప్రో కబడ్డీని వీక్షించే అవకాశం కల్పించాలని ఆయన పాపా హోం విద్యార్థులతో కలిసి వారికి పాస్‌లు ఏర్పాటు చేశారు. చిన్నారులతో కలిసి సీపీ మ్యాచ్‌ను వీక్షిస్తూ ముచ్చటించారు. ఇటువంటి అరుదైన అవకాశం కల్పించిన పోలీస్ కమిషనర్‌కు బాలబాలికలు ధన్యవాదాలు తెలియజేశారు. ఆయనతో కలిసి ఫొటోలు దిగుతూ సందడిగా గడిపారు.

టైలరింగ్ యూనిట్ ప్రారంభం



టైలరింగ్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి

అల్లిపురం: నగర పోలీస్ కమిషనరేట్‌లోని ఆర్మ్‌డ్ రిజర్వ్ ఆవరణలో గల టైలరింగ్ సెంటర్‌ను గురువారం పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రారంభించారు. కొన్నేళ్లుగా ఈ భవనం పాక్షికంగా శిథిలమవడంతో కుట్టుమిషన్లు, యూనిఫామ్‌లు తడిసిపోయేవి. ఈ విషయం సీపీ దృష్టికి రావడంతో పూర్తి స్థాయిలో మరమ్మతులు చేసేందుకు అనుమతులు మంజూరు చేశారు. యూనిట్‌కు ఏసీతోపాటు నూతన యంత్రాలు సమకూర్చారు. కార్యక్రమంలో పలువురు పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

వైద్య కళాశాలల ప్రైవేటీకరణ దుర్మార్గం



మాట్లాడుతున్న ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు అచ్యుత్, రాంబాబు

టీచర్స్ రోడ్డు: చంద్రబాబు అధికారంలోకి వచ్చిన 15 నెలల వ్యవధిలో రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేట్‌కు అప్పగించేందుకు పెద్ద ఎత్తున ప్రయత్నాలు జరుగుతున్నాయంటూ ఏఐవైఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు కె.అచ్యుత్, వై.రాంబాబు ధ్వజమెత్తారు. జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద గురువారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా పోరాటం జరగాల్సిన అవసరముందన్నారు. కేంద్రంలోని మోదీ ప్రభుత్వం దేశవ్యాప్తంగా ప్రైవేటీకరణ ప్రక్రియను వేగవంతం చేసినట్లే, రాష్ట్రంలో సీఎం చంద్రబాబు అదే దారిలో నడుస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యా, వైద్య రంగాలను పూర్తిగా ప్రైవేటుపరం చేయడంపై ఆందోళన వ్యక్తం చేశారు. పర్యాటక రంగంలో రూ.10 వేల కోట్ల విలువైన 22 హోటళ్లు, రిసార్ట్‌లు, ఆస్తులను ప్రైవేట్‌పరం చేయడం దారుణమన్నారు. తాజాగా 10 ప్రభుత్వ వైద్య కళాశాలలను పీపీపీ విధానంలో ప్రైవేటీకరణకు అప్పగించడం అత్యంత దుర్మార్గమన్నారు. ఆదోని, మదనపల్లె, మార్కాపురం, పులివెందుల, పెనుగొండ, పాలకొల్లు, అమలాపురం, నర్సీపట్నం, బాపట్ల, పార్వతీపురం కళాశాలలు ఈ జాబితాలో ఉన్నాయని వివరించారు. విజయవాడ గవర్నరుపేట ఆర్టీసీ డిపోతోపాటు, విశాఖలోని ఆర్టీసీ స్థలాలను లూలూ సంస్థకు అప్పగించేందుకు తీసుకున్న నిర్ణయం కూడా ఇదే కోవలోదన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని పాఠశాలల నుంచి ఇంటర్, ఇంజినీరింగ్, వైద్య కళాశాలలు, విశ్వవిద్యాలయాలన్నీ ప్రైవేటు మయమైపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంజినీరింగ్ విద్య అంటే వీఐటీ, ఎస్ఆర్ఎం, కేఎల్యూ, గీతం వంటి ప్రైవేట్ యూనివర్సిటీల పేర్లే వినిపిస్తున్నాయని, ఇంటర్ విద్య అంటే నారాయణ, చైతన్య కళాశాలలే గుర్తుకొస్తున్నాయని ఎద్దేవా చేశారు. విద్యా శాఖ మంత్రిగా నారా లోకేశ్‌ను నియమించినప్పటికీ ఫలితం లేదని, మొత్తం విద్యా, వైద్య రంగాలను ప్రైవేట్‌కు అప్పగించడం తగదని వ్యాఖ్యానించారు. మధురెడ్డి, భీమరాజు పాల్గొన్నారు.